## క్లుప్తంగా

### యువతి వివాహానికి ఆర్థిక సాయం



యువతి కుటుంబానికి నగదు అందిస్తున్న ఎస్ఎంఆర్ యువసేన సభ్యులు

జిన్నారం(పటాన్‌చెరు): పేదింటి ఆడపిల్ల పెళ్లికి బీఆర్ఎస్ నాయకుడు, చిట్కుల్ సర్పంచ్ నీలం మధు ముదిరాజ్ సాయం అందించారు. మండలంలోని కొడకంచికి చెందిన ఆది నర్సింగరావు యాదవ్ కుమార్తె వివాహానికి ఎన్ఎంఆర్ యువసేన నాయకులు రూ.25 వేల నగదును శనివారం అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఈఓ దశరథ్

మునిపల్లి(అందోల్): పదో తరగతిలో మెరుగైన ఉత్తీర్ణత సాధించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన ఉండాలని ఎంఈఓ దశరథ్ ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం మండలంలోని కంకోల్ జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి 9.30 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు ప్రత్యేక తరగతులు తీసుకోవాలని అన్నారు. ఉత్తీర్ణత పెంచేందుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు కృషి చేయాలని కోరారు.

### 'తెలంగాణలో రాజన్న రాజ్యం ఖాయం'

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ రాజన్న రాజ్యం రావడం ఖాయమని వైఎస్సార్ టీపీ జిల్లా యూత్ కోఆర్డినేటర్ సాయినాథ్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఏటిగడ్డ సంఘం, ఆత్మకూర్, ఎల్లారం, చందాపూర్ గ్రామాల్లో వైఎస్సార్ సంక్షేమ పథకాలను ఇంటింటికి వెళ్లి వివరించారు. వైఎస్సార్ టీపీ తోనే రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు రంగల్ల రమేశ్, సతీష్ కుమార్, నితిన్, హరి తదితరులు పాల్గొన్నారు.

### అధిక పన్ను వసూలు వద్దు



మాట్లాడుతున్న నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): ప్రజలపై అధిక పన్నులతో భారం వేయడం సరికాదని కార్మిక నాయకులు వరప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని బొల్లారం మున్సిపాలిటీలో విలేకరులతో మాట్లాడారు. మున్సిపాలిటీలో ఇష్టారీతిన ఇంటి పన్ను వసూలు చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పెరిగిన ధరలతో సామాన్యుడిపై భారం పడగా, పన్నులతో మరింత భారం మోపడం సరికాదన్నారు. మున్సిపల్ అధికారులు మరోసారి ఆలోచించి పన్ను తగ్గించి పేదలకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రారెడ్డి, చక్రపాణి, వెంకటయ్య పాల్గొన్నారు.

### ఆలయాల్లో భక్తుల కిటకిట



హనుమాన్ ఆలయంలో భక్తుల క్యూ

పటాన్‌చెరు టౌన్: అమావాస్య పుష్య మాసం పురస్కరించుకొని శనివారం పట్టణంలోని శ్రీరామలింగేశ్వర ఆలయంలో అర్చకుడు మహేశ్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. శ్రీపంచముఖీ హనుమాన్ ఆలయం, మంజీర క్యాంపస్‌లో శ్రీరామలింగేశ్వర, శనీశ్వర ఆలయాల్లో తైలాభిషేకాలు నిర్వహించారు.

### కొనసాగుతున్న ఆటల పోటీలు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని పస్తాపూర్ ఆర్ఎల్ఆర్ పాఠశాలలో రెండో రోజు శనివారం ఆటల పోటీలు జరిగాయి. విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. కబడ్డీ, ఖోఖో, పరుగు పందెం, స్కిప్పింగ్ తదితర పోటీలను నిర్వహించారు. మూడు రోజుల పాటు పోటీలు కొనసాగుతాయని, అనంతరం విజేతలకు బహుమతులను అందిస్తామని ప్రిన్సిపాల్ జి.కవిత తెలిపారు. కార్యక్రమంలో పీఈటీలు విష్ణువర్ధన్‌రెడ్డి, రాజు, రాజేష్, నవీన్, మహేష్, అపర్ణ పాల్గొన్నారు.

# 'పది'లో ప్రథమ స్థానం రావాలి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి మెరుగైన ఉత్తీర్ణత సాధించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న 1,947 మంది విద్యార్థులకు అల్పాహారం కోసం రూ.15 లక్షలను అందించారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎంఈఓలతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో పది ఉత్తీర్ణత పెంచేందుకు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేస్తున్నారని, విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు 75 రోజుల పాటు అల్పాహారం కోసం ఆర్థిక సాయం అందించినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, అమీన్‌పూర్ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, ఎంఈఓలు జెమిని కుమారి, విజయ, రాథోడ్, బీఆర్ఎస్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, హన్మంత్ రెడ్డి, బండి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

### రిపబ్లిక్ డే ఏర్పాట్లపై సమీక్ష

పట్టణంలోని మైత్రి మైదానంలో నిర్వహించబోయే రిపబ్లిక్ డే వేడులకు అన్ని శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలను రూపొందించాలన్నారు. సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ బాలయ్య, తహసీల్దార్ పరమేశం, మండల విద్యాశాఖ అధికారి రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

## విద్యార్థుల అభ్యసన స్థాయిని పెంచాలి



విద్యార్థిని అభ్యసనను పరిశీలిస్తున్న అధికారి కృష్ణారావు

జిన్నారం(పటాన్‌చెరు): విద్యార్థుల అభ్యసన స్థాయి పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని పదో తరగతి ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు వి.కృష్ణారావు అన్నారు. శనివారం మండలం ఖాజీపల్లి ఎంపీపీఎస్‌లో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన తల్లితండ్రుల సమక్షంలో విద్యార్థుల అభ్యసన స్థాయి, పుస్తకాలు, చార్టులు, మౌఖిక నైపుణ్యాలను పరిశీలించారు. సర్పంచ్ సత్యనారాయణ, ఎస్ఎంసీ చైర్మన్ అనిత విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించి ఉపాధ్యాయుల పనితీరును ప్రశంసించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం అనిల్‌కుమార్, బొల్లారం జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం మంగీలాల్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

### వేంకట చల క్షేత్రంలో ప్రత్యేక పూజలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): భక్తుల గోవింద నామస్మరణ.. అన్నమయ్య సంకీర్తనల నడుమ వేంకట చల క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల, సదాశివపేటలో భక్తులు స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ చిల్వేరి వెంకటేశం, భక్తులు పాల్గొన్నారు.

### సమస్యల పరిష్కారానికి కృషి



కార్మికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కాలనీల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ బూరుగడ్డ పుష్ప అన్నారు. బస్తీ దర్శన్ కార్యక్రమంలో భాగంగా శనివారం డివిజన్ పరిధిలోని వినాయక నగర్ కాలనీలో పర్యటించారు. వార్డులో ఇంటింటా తిరిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వినాయక నగర్, జ్యోతి నగర్, కానుకుంట వాసుల కోసం త్వరలో జ్యోతి నగర్ కమ్యూనిటీ హాల్‌లో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం పారిశుధ్య కార్మికులతో మాట్లాడి, సమస్యలను తెలుసుకున్నారు.

### సమస్యలను పరిష్కరించండి



మాట్లాడుతున్న సాయిలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సాయిలు డిమాండ్ చేశారు. శనివారం బీహెచ్ఈఎల్‌లో ఏఐటీయూసీ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కార్మిక సమస్యలను పరిష్కరించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 30 ఏళ్లుగా పనిచేస్తున్న రూ.3వేలు వేతనం తీసుకోలేని పరిస్థితి నెలకొందని వాపోయారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, రూ.25వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాఠశాలలో అటెండర్, స్వీపర్లను, ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 27న కలెక్టర్ ఎదుట ధర్నా నిర్వహిస్తామని తెలిపారు.

## ట్రాఫిక్ సమస్య నివారణకు చర్యలు



సూచనలు చేస్తున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

కంది(సంగారెడ్డి): కంది చౌరస్తాలో ట్రాఫిక్ సమస్యను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డీఎస్పీ రవీందర్ రెడ్డి తెలిపారు. ట్రాఫిక్ జామ్ నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై శనివారం అధికారులు, గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చౌరస్తాలో ప్రమాదాల నివారణకు శంకర్‌పల్లి వైపు మురికి కాల్వను పూడ్చి రోడ్డు విస్తరణ చేపట్టాలని స్థానికులు కోరారు. సీసీఎస్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా యూ టర్న్ ఏర్పాటు చేయాలని, జాతీయ రహదారిపై ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా రంబుల్ స్ట్రిక్స్‌ను ఏర్పాటు చేయాలని ఎన్‌హెచ్ ఈఈ ధర్మారెడ్డిని కోరారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని ఈఈ తెలిపారు. కార్యక్రమంలో రూరల్ సీఐ శివలింగం, ఎన్‌హెచ్ డీఈ రామకృష్ణ, సర్పంచ్ విమలా వీరేశం, ట్రాఫిక్ సీఐ, ఎస్ఐలు, ఆర్అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

### ఘనంగా మాఘ స్నానాలు



పూజలు చేస్తున్న సంజీవరెడ్డి దంపతులు

మనూరు(నారాయణఖేడ్): మాఘ శని అమావాస్య సందర్భంగా మండలంలోని బోరంచ మంజీరా తీరంలో సంఘమేశ్వర ఆలయంలో శనివారం భక్తులు మాఘ స్నానాలు చేశారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సంజీవ్‌రెడ్డి దంపతులు ప్రత్యేక యజ్ఞం , పూజా కార్యక్రమాలు, శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక భజన కార్యక్రమాలు కొనసాగాయి. కార్యక్రమంలో మాజీ డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, బోజిరెడ్డి పాల్గొన్నారు.

మునిపల్లి(అందోల్): శనివారం అమావాస్య సందర్భంగా మండలంలోని అంతారం జీవన్ముక్త సంస్థానంలో పాండురంగ విఠలేశ్వర, రుక్మాబాయి దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయం భక్తులతో కిక్కిరిసి పోయింది. జీవన్ముక్త సంస్థాన పీఠాధిపతి భాల్‌రాజ్ జ్ఞానేశ్వర్ మహారాజ్ భక్తులకు తీర్థ ప్రసాదం పంపిణీ చేశారు.

### తహసీల్దార్ విచారణ



విచారణ చేస్తున్న తహసీల్దార్

హత్నూర( సంగారెడ్డి): మండలంలోని గుండ్ల మాచునూర్ గ్రామ శివారులో ఏర్పాటు చేసిన ఊర పందుల షెడ్డును శనివారం తహసీల్దార్ పద్మావతి పరిశీలించారు. మోడల్ స్కూల్ సమీపంలో పందుల షెడ్డు, పరిశ్రమల క్యాంటీన్ వ్యర్థాల దుర్వాసనతో విద్యార్థులు ఇబ్బందులకు గురైనట్లు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు తహసీల్దార్ పద్మావతి పందుల షెడ్డు ప్రాంతాన్ని పరిశీలించారు. పాఠశాలకు సమీపంలో ఉన్న షెడ్డును తొలగించి, ప్రస్తుతం కిలోమీటర్ దూరంలో ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తహసీల్దార్‌కు తెలిపారు. తహసీల్దార్ వెంట కార్యదర్శి రమణారెడ్డి తదితరులు ఉన్నారు.

# నిరుపేదలకు ప్రభుత్వం అండ



చెక్కు అందిస్తున్న మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే మాణిక్‌రావు

కోహీర్(జహీరాబాద్): కష్టాల్లో ఉన్న నిరుపేద కుటుంబాలను ప్రభుత్వం అండగా ఉంటుందని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. కోహీర్ మండలం దిగ్వాల్ గ్రామానికి చెందిన పుణ్యమ్మ భర్త ఏసురత్నం ఇటీవల మృతిచెందడంతో ముగ్గురు కుమార్తెలతో కుటుంబం గడవడం కష్టంగా మారింది. పుణ్యమ్మ అభ్యర్థన మేరకు మంత్రి హరీశ్‌రావుతో మాట్లాడగా, ఆయన డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి రూ.5 లక్షలను మంజూరు చేయించారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా చెక్కును అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, డీఆర్‌డీఓ శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి నరసింహారావు, మండల వ్యవసాయాధికారి నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

# వ్యాయామంతోనే ఆరోగ్యం

నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



వ్యాయామం చేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: మారుతున్న జీవన విధానాలతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, ఆరోగ్యం కోసం ప్రతీ ఒక్కరూ వ్యాయామం చేయాలని ఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి సూచించారు. ఖేడ్ ఆక్సిజన్ పార్కులో రూ.13 లక్షలతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను శనివారం ప్రారంభించారు. వివిధ పరికరాలతో కొంతసేపు వ్యాయామం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉంటేనే ఏదైనా సాధించగలుగుతామని, పట్టణ ప్రజల ఆరోగ్యం కోసం ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేయించామని అన్నారు. పిల్లలు ఆక్సిజన్‌పార్కును, పెద్దలు ఓపెన్‌జిమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని కోరారు. అనంతరం పార్కులో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనా నజీబ్, వైస్ చైర్మన్ పరశురాం, జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్ నాయక్, కౌన్సిలర్లు మాజీద్, నర్సింహులు, స్వప్న అభిషేక్ షెట్కార్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విజయ్‌బుజ్జి, నాయకులు పరమేశ్వర్, ముజామ్మిల్, సత్యనారాయణ, గౌస్‌చిస్తి, నగేష్, శేఖర్ పాల్గొన్నారు.

**కొనుగోలు కేంద్రం ప్రారంభం**

ఖేడ్ మార్కెట్ యార్డులో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులు దళారులకు అమ్ముకోకుండా కొనుగోలు కేంద్రంలో విక్రయించి మద్దతు ధర పొందాలని అన్నారు. అనంతరం ఖేడ్ మండలం కిషన్‌నాయక్ తండాలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన జీతాలాల్ కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు.

## శనేశ్వరాలయంలో భక్తుల పూజలు



నారాయణఖేడ్: శనీశ్వరుడికి తైలాభిషేకం చేస్తున్న దృశ్యం

నారాయణఖేడ్: శని అమావాస్య పురస్కరించుకొని ఖేడ్ మండలంలోని పంచగామలోని శనేశ్వరాలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు పొరుగున ఉన్న కర్ణాటక, మహారాష్ట్రల నుంచి సైతం భక్తులు తరలివచ్చారు. ఆలయం నుంచి కిలోమీటర్ వరకు బారులు తీరి ఆలయంలోని శనీశ్వరుడిని దర్శించుకున్నారు. టెంకాయల్ని నైవేద్యంగా సమర్పించి అర్చకులతో తైలాభిషేకం చేయించారు. ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు తైలాభిషేకాలు, ప్రత్యేక పూజలు, సాయంత్రం 4గంటలకు హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నవితరణ ఏర్పాటు చేశారు.

ఝరాసంగం(జహీరాబాద్): మండలంలోని శనీశ్వరాలయం శనివారం భక్తులతో సందడిగా మారింది. అమావాస్య పురస్కరించుకొని బర్దిపూర్, ఏడాకులపల్లి గ్రామాల్లో శనీశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భాగంగా తిలతైలాభిషేకం, హోమం, డోలారోహణం నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదం అందించి, అన్నదానం చేశారు. కార్యక్రమంలో బర్దిపూర్ ఆశ్రమ పీఠాధిపతి 108 వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహారాజ్, ఏడాకులపల్లి శనిఘాట్ పాలకమండలి భాస్కర్ రెడ్డి, రఘునందన్ రెడ్డి, శుక్లవర్ధన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సంగారెడ్డి, విట్టల్, శ్రీహరి రెడ్డి, టీపీసీసీ నాయకుడు నరోత్తం, వైస్ ఎంపీపీ మల్లన్న పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

**సిద్దేశ్వరాలయంలో పూజలు**

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని అల్గోల్ రోడ్డులో శ్రీసిద్దేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యే పూజలు నిర్వహించారు. పూజారి సంగమేశ్వర స్వామి వారికి రుద్రాభిషేకం, తైలాభిషేకం నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు ఈఓ మోహన్‌రెడ్డి తెలిపారు.

### 'పది' విద్యార్థులకు స్నాక్స్



విద్యార్థులకు స్నాక్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థినులకు మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనా నజీబ్ సొంత ఖర్చులతో అందించిన స్నాక్స్‌ను శనివారం ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విజయ్‌బుజ్జి, సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్ చౌహాన్, బీఆర్ఎస్ అధ్యక్షుడు పరమేశ్వర్, దొడ్ల సాయి తదితరులు ఉన్నారు. నిజాంపేట్ మండలంలో పది విద్యార్థులకు బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్ చౌహాన్ అల్పాహారం పంపిణీ చేశారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సాయిరెడ్డి, సర్పంచ్ జగదీశ్వరాచారి పాల్గొన్నారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన ఆరుగురికి సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులకు ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సువర్ణ షెట్కార్, వైస్ చైర్మన్ విజయ్‌బుజ్జి, బీఆర్ఎస్ అధ్యక్షులు పరమేశ్వర్, సత్యపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

### శ్రీశైలానికి చేరిన భక్తుల పాదయాత్ర



శ్రీశైలంలో పాదయాత్ర బృందం సభ్యులు

ఝరాసంగం(జహీరాబాద్): మండలంలో దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకి సంగమేశ్వర ఆలయం నుండి తొమ్మిది రోజుల క్రితం భక్తులు చేపట్టిన పాదయాత్ర శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీశైలానికి చేరుకుంది. మండలంలోని పలు గ్రామాల ప్రజలు శ్రీశైలానికి పాదయాత్రగా బయల్దేరి తొమ్మిది రోజులపాటు భజన కార్యక్రమాలు చేస్తూ తరలి వెళ్లారు. మహా క్షేత్రంలోని భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు.

## సంక్షిప్త వార్తలు

◆ **దరఖాస్తుల ఆహ్వానం**

హత్నూర( సంగారెడ్డి): మండలంలోని గుండ్ల మాచునూర్ మోడల్ స్కూల్‌లో ఖాళీలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మీ తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి గాను 6 నుంచి పదో తరగతిలో ప్రవేశాలకు జనవరి 10 నుంచి ఫిబ్రవరి 15 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

◆ **మైనార్టీ గురుకులంలో ప్రవేశాలకు..**

జహీరాబాద్ టౌన్: మండలంలోని అల్గోల్ మైనార్టీ బాలుర పాఠశాలలో 2023₹24 విద్యా సంవత్సరానికి ఐదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్స్ జి.రాములు, ఎస్‌కే.జమీల్ తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ప్రవేశాలకు పది పూర్తిచేసిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 5వ తరగతిలో ముస్లిం మైనార్టీ సీట్లు–51, క్రిస్టియన్–5, జైన్, పార్శి, బుద్ధ, సిక్కు–4 సీట్లు, నాన్ మైనార్టీ విద్యార్థులకు 20 సీట్లు ఉన్నాయన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా జనవరి 30వ తేదీ లోగా సమర్పించాలన్నారు. 6, 7, 8 తరగతుల బ్యాక్‌లాగ్ మైనార్టీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణంలోని మైనార్టీ బాలుర, బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలల్లో 2023–24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖాదర్, ఎం.మంజుల తెలిపారు. 5వ తరగతిలో–80సీట్లు, మైనార్టీలకు 60సీట్లు, నాన్‌మైనార్టీలకు 20సీట్లు ఉన్నాయన్నారు. ఇంటర్ ఫస్టియర్‌లో ఒక్కో గ్రూపులో 40 సీట్లు ఉన్నాయని, అర్హులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆధార్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఫోన్ నంబరు, నాన్‌మైనార్టీలకు ఆదాయ, కులం, లోకల్ సర్టిఫికెట్లతో ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు బాలుర విభాగానికి సంబంధించి 9440054943, 7995057963, బాలికల విభాగానికి సంబంధించి 9948092055 నంబర్లలో సంప్రదించాలన్నారు.

◆ **సేవాలాల్ ఉత్సవాలపై నేడు సమావేశం**

నారాయణఖేడ్: వచ్చేనెల 15న నిర్వహించనున్న సంత్ సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలపై ఖేడ్ బంజారా భవన్‌లో ఈనెల 22న సాయంత్రం 4గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు ఉత్సవకమిటీ బాధ్యులు తెలిపారు. నియోజకవర్గంలోని గిరిజన సంఘాల బాధ్యులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలన్నారు.

◆ **కేలండర్ ఆవిష్కరణ**

సంగారెడ్డి టౌన్: కల్లుగీత కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా కమిటీ 2023 కేలండర్‌ను శనివారం కలెక్టర్ శరత్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎస్.ఆశన్న గౌడ్, ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్నగౌడ్, మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడు కృష్ణ గౌడ్, కంది మండల కార్యదర్శి శ్రీధర్ గౌడ్, నాయకులు అంజా గౌడ్, కుమార్ గౌడ్, నారాయణ గౌడ్, పవన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **బీమాతో భవిష్యత్‌కు దీమా**

పటాన్‌చెరు టౌన్: బీమాతో భవిష్యత్‌కు దీమా కలుగుతుందని ముత్తంగి ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ మల్లేశ్ అన్నారు. ప్రమాద బీమా చేయించుకొని ఇటీవల మృతిచెందిన బీమాదారుడి కుటుంబానికి మంజూరైన రూ.4లక్షల చెక్‌ను శనివారం ఆయన అందజేశారు. రీజినల్ మేనేజర్ కళ్యాణ్, జయరాం రెడ్డి, ఆపరేషన్ మేనేజర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

◆ **పెండింగ్ స్కాలర్‌షిప్ విడుదల చేయాలి**

కొండాపూర్(సంగారెడ్డి): రాష్ట్రంలోని 18 లక్షలకు పైగా విద్యార్థులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్, రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ ప్రవీణ్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సంగారెడ్డిలో రాస్తారోకో నిర్వహించి, అనంతరం మాట్లాడారు. స్కాలర్ షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల కాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. త్వరగా వాటిని విడుదల చేయాలని, లేదంటే ప్రగతి భవన్ ముట్టడిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సంగారెడ్డి అసెంబ్లీ ఇన్‌చార్జ్ రాజేశ్వర్ రావు దేశపాండే, సంగారెడ్డి అసెంబ్లీ కన్వీనర్ పోచారం రాములు, పట్టణ అధ్యక్షుడు ప్రసాది రవి శంకర్. కౌన్సిలర్లు నాగరాజు, వాసు, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు వినోద్, మండలాల అధ్యక్షులు దేవేందర్, రాజేందర్, ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

◆ **వైద్య శిబిరానికి స్పందన**



మనూరు(నారాయణఖేడ్): మనూరు, నాగల్‌గిద్ద మండలాల్లో టీపీసీసీ ఉపాధ్యక్షుడు, జహీరాబాద్ పార్లమెంట్ మాజీ ఎంపీ సురేశ్‌షెట్కార్ ఆధ్వర్యంలో 'మన ఊరు–మన డాక్టర్' కార్యక్రమంలో భాగంగా మనూరు, నాగల్‌గిద్ద మండలాల్లో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. చిన్న పిల్లల వైద్యనిపుణులు డాక్టర్ గిరిజా శెట్కార్ 250 మందికి పైగా చిన్నారులకు పరీక్షలు చేసి, మందులను అందజేశారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు శంకరయ్య స్వామి, నాయకులు సాగర్ శెట్కార్, మనూరు, నాగల్‌గిద్ద మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుభాష్ రావు పాటిల్, మాణిక్‌రావుపాటిల్ పాల్గొన్నారు.

### అర్హులకు 'డబుల్' ఇళ్లు ఇవ్వాలి

జహీరాబాద్ టౌన్: అర్హులకు డబుల్‌బెడ్ రూం ఇళ్లను ఇవ్వాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఆర్డీఓ కార్యాలయం వరకు భ్యారీ ర్యాలీ నిర్వహించి, కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జహీరాబాద్ కమిటీ సభ్యుడు మహిపాల్ మాట్లాడుతూ పట్టణంలోని రహమత్‌నగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. అర్హులకు కాకుండా అనర్హులకు ఇళ్లను పంపిణీ చేశారని, పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి అనర్హులను గుర్తించి తొలగించాలన్నారు. ఇంటి స్థలం ఉన్నవారికి రూ.3 లక్షలను మంజూరు చేయాలన్నారు. హోతి(కె)లో నిర్మిస్తున్న డబుల్‌బెడ్ రూం ఇళ్ల పనులు వేగవంతం చేసి, పేదలకు పంపిణీ చేయాలని కోరారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ అధికారిణికి వినతి పత్రం అందజేశారు. సీపీఎం నాయకులు బక్కన్న, శాంతమ్మ, యాదుల్ పట్టణ ప్రజలు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న దృశ్యం